# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 13-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారడంలో విమానయాన రంగం కీలకపాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికి ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేలా త్వరలో నూతన విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నామని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**
4. **తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.**
5. **గురుకులాల్లో డిగ్రీ, ఐటీఐ కోర్సులు అందుబాటులోకి తెస్తామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.**

==========================

భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారడంలో విమానయాన రంగం కీలకపాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో పౌర విమానయానానికి సంబంధించిన రెండో ఆసియా – పసిఫిక్ మంత్రుల సదస్సులో నిన్న ప్రధానమంత్రి పాల్గొని అన్ని సభ్య దేశాలు "ఢిల్లీ డిక్లరేషన్"ను ఆమోదించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, భారతదేశ విమానయాన రంగం విశేషమైన అభివృద్ధి సాధిస్తూ పౌరులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత చేరువ చేసిందని అన్నారు. దేశంలోని చిన్న నగరాలకు సైతం ప్రయాణ సేవలను అందిస్తూ విమానయాన రంగం ముందుకువెళుతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

--------------------------

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికి 5 లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం

తీసుకున్న నిర్ణయం వల్ల 6 కోట్ల మంది వయోధికులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వృద్ధాప్యం కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యల ఖర్చులను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకంతో అధిగమించవచ్చని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేలా త్వరలో నూతన ఎం.ఎస్.ఎం.ఈ.విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎం.ఎస్.ఎం.ఈ.ల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఉమ్మడి సదుపాయాల కేంద్రాలను ఏర్పాటు చేసి ఎం.ఎస్.ఎం.ఈ.లను పూర్తి స్థాయిలో బలోపేతం చేయనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

తెలంగాణలో షెడ్యూల్డ్ కులాలు–ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఉపాధ్యక్షులుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని ప్రభుత్వం నియమించింది. ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు సంబంధించిన అన్ని అంశాలపై కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించనుందని ప్రభుత్వం తెలిపింది.

---------------------------

భారత కమ్యూనిస్టు పార్టీ –సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న తుదిశ్వాస విడిచారు. ఆయన మూడు దశాబ్దాలుగా సీపీఎం పొలిట్ బ్యూరోలో సభ్యులుగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. సీతారాం మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. వామపక్షాలకు సీతారాం దిక్సూచిగా వ్యవహరించారని, రాజకీయ రంగంలో తనదైన ముద్రవేశారని సామాజిక మాధ్యమం వేదికగా వారు కొనియాడారు.

---------------------------

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో రాష్ట్రస్థాయి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. వేడుకల ఏర్పాట్లపై నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 17వ తేదీన అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా అన్ని శాఖల ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏ పరిధిలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు భూ కేటాయింపుల అంశాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం ఆరుగురు మంత్రులతో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, గనులు,ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్‌లు సభ్యులుగా ఉంటారని తెలిపింది. అమరావతిలో జరిగిన భూ కేటాయింపులపై సమీక్ష, కేటాయించిన భూమి వినియోగంపై అంచనా వేసి అవసరమైన మార్పులను మంత్రుల కమిటీ సూచించనుందని,. వివిధ రంగాలలోని ప్రపంచ స్థాయి సంస్థలను గుర్తించి అమరావతిలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన సహకారాన్ని ఉప సంఘం అందించనుందని ప్రభుత్వం తెలిపింది. వివిధ సంస్థల భూ కేటాయింపు పురోగతిని పర్యవేక్షించి ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు చేయనుంది.

---------------------------

విద్యకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఉమ్మడి క్రిష్ణా జిల్లాలోని గురుకుల పాఠశాలలని మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గురుకులాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని, గురుకులాల్లో డిగ్రీ, ఐటీఐ కోర్సులు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మంత్రి ఉపాధ్యాయులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వరదల కారణంగా సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందం నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశమైంది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం రెండ్రోజులు పాటు పర్యటించింది. వరద నష్టంపై చేపడుతోన్న గణన గురించి ముఖ్యమంత్రికి కేంద్ర బృందం వివరించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రాథమికంగా 6 వేల 882 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపిందని తెలిపారు. రాష్ట్రంలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని చంద్రబాబునాయుడు కేంద్ర బృందాలను కోరారు. పంట నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం జరిగిందని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో బోధనాసుపత్రుల పనితీరును ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న మంత్రి బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లతో సమావేశమై, బోధనాసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం గత నెలలో నిర్దేశించిన 30 అంశాల ప్రాతిపదికన తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో బోధనాసుపత్రుల పురోగతి విజిలెన్స్ బృందాల తనిఖీ ద్వారా తెలుస్తాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన 30 అంశాల కార్యాచరణ ప్రణాళిక మేరకు మొదటి మూడు నెలల్లో చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించి సత్ఫలితాలను సాధించాలని మంత్రి సూచించారు.

---------------------------

ఏలేరు మరమ్మతులను ప్రభుత్వం చేపట్టకపోవడం వల్లే వరద ఉధృతి పెరిగి పంటలు నీట మునిగాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కండ్రుకోటలో ఏలేరు ముంపు ప్రాంతాలను ఆమె నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా వైయస్ షర్మిల పాత్రికేయులతో మాట్లాడుతూ, వరదల వల్ల రైతులు నష్టపోయారని. ఒక్కో రైతుకు ఇప్పటి వరకు 30వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అన్నారు. ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని షర్మిల డిమాండ్ చేశారు.

======================